

# మ్యూజికల్ మ్యూజింగ్స్

## - కస్తూరి మురళీకృష్ణ

కొయీ జబ్ తుమ్హారా హృదయ్ తోడ్ దే

తడప్‌తా హువా జబ్ కొయీ ఛోడ్ దే

తబ్ తుమ్ మెరే పాస్ ఆనా ప్రియే

మెరా దర్ ఖులా హై, ఖులా హీ రహేగా

తుమ్హారే లియే...

'పూరబ్ ఔర్ పశ్చిమ్' సినిమా ఒక సంధి యుగానికి దర్పణం పదుతుంది. అది ట్రెండ్ సెట్టింగ్ సినిమా. 'షహీద్ సినిమాతో సినీ రంగంలో నిలద్రొక్కుకున్న మనోజ్ కుమార్, అప్పటి హీరోలకు భిన్నంగా తనకొక ప్రత్యేక ఇమేజ్‌ని సృష్టించుకోకపోతే తన అస్తిత్వం ప్రమాదంలో పదుతుందని గ్రహించాడు. ఎంతోమంది ప్రేమకథల హీరోల్లాగా తానూ ఓ పాటలు పాడే ప్రేమ కథల హీరోగా మిగిలిపోతానని అర్థం చేసుకున్నాడు. ఫలితంగా మూర్తీభవించిన దేశభక్తి 'మిష్టర్ భరత్' పాత్ర రూపొందించాడు. ఈనాటికీ దేశభక్తి సినిమాలన్నా, సినిమాల్లో దేశభక్తి అన్నా 'మిష్టర్ భరత్' ముందుగా గుర్తుకు వచ్చే రీతిలో ప్రామాణికమైన సినిమాలు రూపొందించాడు.

'ఉపకార్' సినిమాతో ఆరంభమయిన 'మిష్టర్ భరత్' ప్రయాణం 'పూరబ్ ఔర్ పశ్చిమ్' సినిమాతో ఊపందుకుంది. ఈ సినిమాలో, అప్పుడప్పుడే విదేశాలలో స్థిరపడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలను తిరస్కరించి, విదేశీ జీవన విధానం పట్ల ఆకర్షితులవుతున్న భారతీయులకు, భారతీయ సంస్కృతి సంప్రదాయాల ఔన్నత్యాన్ని ప్రదర్శించి, భారతదేశ ఔన్నత్యాన్ని, పాశ్చాత్యుల దిగజారుడుతనాన్ని ఎత్తి చూపించటం ప్రధానాంశం. పూరబ్ గొప్ప, పశ్చిమ్ దిగజారుదు అన్న స్టీరియో టైప్ ఆలోచనకు బలమిస్తుందీ సినిమా.

సినిమాలో నాయకుడు చదువుకోసం ఇంగ్లండ్ వెళ్తాడు. అక్కడ పూర్తిగా విదేశీ సంస్కృతిని ఆకళింపు చేసుకుని, అనుసరించే యువతి ప్రేమలో పడతాడు. ఆమె మినీస్కర్టులు వేసుకుంటుంది (కెమేరా కన్ను విషయంలో మనోజ్ కుమార్ దేశభక్తి అంగాంగ ప్రదర్శనాసక్తిగా మారుతుంది) సిగరెట్లు తాగుతుంది. మద్యం తాగుతుంది. బోలెడమంది బాయ్ ఫ్రెండ్స్ ఉంటారు. అంటే పూర్తిగా ఆ కాలంలోని 'భారతీయ నారి' ఇమేజ్‌కి భిన్నంగా ఉంటుందన్నమాట నాయిక. అయినా సరే నాయకుడు ఆమెను ప్రేమిస్తాడు.

ఆ కాలంలో ఇదొక విప్లవాత్మకమైన ఆలోచన.

నాయకుడు రాముడు. నాయిక సీత. ఇలాంటి ఆలోచనలే అధికంగా కనిపించే సినిమాలలో నాయకుడు నాయిక ఎలాంటిదయినా, సంపూర్ణంగా ప్రేమించి స్వీకరించటం అప్పటికి అంతగా అలవాటులేదు.

అక్కడక్కడా 'మై రామ్ నహీ హూ ఫిర్ క్యూన్ ఉమ్మీద్ కరూన్ సీతా కీ? '( నేను రాముడిని కానప్పుడు సీతను ఎలా ఆశించను?)లాంటి ఆలోచనలు వినిపించినా, ఇంక సంపూర్ణంగా నాయిక సకల దోషాలను స్వీకరించి, ఆమెకోసం 'ఆజన్మాంతం ఎదురు చూస్తుంటాను తల వంచి' అన్నటువంటి 'సమర్పణ' అరుదు.

సినిమాలో నాయకుడు నాయికను, తనతోపాటుగా భారత్‌కు వచ్చెయ్యమంటాడు. నాయిక అంగీకరించదు. ఇంగ్లండ్‌లోనే నాయకుడు స్థిరపడాలంటుంది. దాంతో వారు వేరయ్యే పరిస్థితి నెలకొంటుంది. వారి ప్రేమ అక్కడితో అంతమయ్యే పరిస్థితులు ఏర్పడతాయి. ఆ సందర్భంలో వస్తుంది ఈ పాట.

'కొయీ జబ్ తుమ్హారా హృదయ్ తోడ్‌దే'. ఇందీవర్ తన తొలి సినీగీతం 1957లో రాసినా 1960 దశాబ్దం చివరనుంచీ, అతని పాటలు అధికంగా వినిపించటం మొదలయింది. అంతకు ముందు అక్కడో హిట్ పాట, ఇక్కడో హిట్ పాట రాసినా కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ సంగీత దర్శకత్వంలో రచంచిన పాటలతో ఆయన ఎక్కువ ప్రాచుర్యం పొందాడు.

ఇందీవర్ రచనా శైలి ఆ కాలంనాటి గేయ రచయితల శైలికంటే భిన్నమయినది. ఆయన గీతాలలో అంతవరకూ హిందీ సినీగీతాలలో వినిపించనటువంటి అందమైన భావనలు వినిపిస్తాయి. ఆయన అధికంగా శుద్ధ హిందీ పదాలు వాడతాడు. కాని సాంప్రదాయక ప్రతీకలు అధికంగా వాడతాడు. కానీ ఆయన పాటలలో ఆంగ్ల కవిత్వ సాహిత్య ప్రభావం స్పష్టంగా తెలుస్తూంటుంది. అది ఈ పాటలో ఇంకా స్పష్టంగా కనిపిస్తుంది.

నాయిక పట్టుదలకు పోయి తమ ప్రేమను సైతం పాతిపెట్టేందుకు సిద్ధపడుతుంది. అయినా సరే నాయకుడు అచంచలమైన ప్రేమను ప్రదర్శిస్తాడు. అయితే, అప్పటి నాయకులలా 'నీ సుఖమే నే కోరుతున్నా, నిను వీడి అందుకే వెళ్తున్నా' అనడు. లేదా ఎక్కడ ఉన్నా ఆమె సుఖంగా ఉండాలని ఆశీర్వదించి, కన్నీళ్లు తుడుచుకుని వెళ్లిపోడు.

ఎవరైనా ఎప్పుడైనా నీ హృదయాన్ని గాయపరిస్తే, , నిన్ను ఎవరో వదిలివెళ్లిపోయారని నువ్వు బాధపడుతూంటే, అప్పుడు నువ్వు నా దగ్గరకు రా ప్రియతమా. నా హృదయపు తలుపు తెరిచి ఉంటుంది. అది ఎప్పటికయినా తెరిచే ఉంటుంది.

వినగానే అద్భుతంగా అనిపించే భావం. అచంచలమైన ప్రేమను వ్యక్తపరుస్తుందీ భావం. ఆమె తనను కాదన్నా ఆమెకు ఏ కష్టం కలిగినా, ఎలాంటి అవసరం పడినా 'నీకోసం నేనున్నా' అని అంటున్నాడు.

**నిన్ను నిన్నుగా ప్రేమించుటకు**

**నీ కోసమే కన్నీరు నించుటకు**

**నేనున్నానని నిండుగ పలికే**

**తోడొకరుండిన అదే భాగ్యము, అదే స్వర్గమూ**

సరిగ్గా తెలుగులో శ్రీశ్రీ ఏది భాగ్యమూ, స్వర్గమూ అన్నాడో, ఆ స్వర్గంలాంటి హృదయ ద్వారాలు ఆమెకోసం ఎప్పుడూ తెరచుకుని ఉంటాయని అంటున్నాడు హీరో. ఒక కోణం నుంచి చూస్తే అమరమైన ప్రేమ. మరో కోణం నుంచి చూస్తే నాయకుడు ఆమెకు శాపనార్థాలు పెడుతున్నాడనిపిస్తుంది. ఆమె హృదయం పగలాలని, ఆమెను ఎవరో ఒంటరిగా వదలివెళ్లాలని, బాధపడుతూ సాంత్వన కోసం ఆమె తన దగ్గరకు రావాలన్న ఆలోచన కూడా కనిపిస్తుంది.

**మెరే దుష్మన్ తూ మెరే దోస్తీ కో తర్సే**

**ముఝే గమ్ దేనెవాలీ, తూ ఖుషీ కో తర్సే.**

ఆనంద్ బక్షీ రాసిన ఈ పాట బహిరంగంగా నాయకను శాపనార్థాలు పెట్టే పాట. తన ప్రేమను కాదంది కాబట్టి ఆమె తన శత్రువు. ఆమె తన స్నేహం కోసం తపించాలి. తనకు వేదనను ఇచ్చింది కాబట్టి, ఆమె సంతోషం కోసం

తపించాలి. ఇంత బహిరంగంగా కాకుండా ఎంతో సున్నితంగా ఈ భావననే కలిగిస్తుంది 'కొయీ జబ్ తుమ్హారా హృదయ్ తోడ్‌దే' పాట.

అయితే ఇందీవర్ రాసిన ఈ పాట పల్లవి అద్భుతంగా అనిపిస్తే చరణం ఇంకా అద్భుతంగా అనిపిస్తుంది.

**అభీ తుమ్ కొ మెరీ జరూరత్ నహీ**

**బహుత్ చాహనేవాలె మిల్ జాయేంగే**

**అభీ రూప్ కా ఏక్ సాగర్ హో తుమ్**

**కవల్ జిత్‌నె చాహోగి ఖిల్ జాయేంగే**

**దర్పణ్ తుమ్హే జబ్ డరానే లగే**

**జవానీభి దామన్ ఛుడానే లగే**

**తబ్ తుమ్ మెరే పాస్ ఆనా ప్రియే**

**మెరా సర్ ఝుకాహై, ఝూకాహీ రహేగా**

**తుమ్హారే లియే**

ఇప్పుడు ఆమెకు తన అవసరంలేదు. ఎందుకంటే ఆమెని ప్రేమించేవారు ఎంతోమంది ఆమెకు లభిస్తారు. ఆమె అందమైన రూపానికి సాగరం లాంటిది. కాబట్టి ఆమె ఏం కావాలంటే అది లభిస్తుంది. కానీ, ఎప్పుడయితే ఆమె రూపలావణ్యాలు నశిస్తూ, అద్దంలో ఆమె ప్రతిబింబం ఆమెను భయపెడుతూంటుందో, యవ్వనం ఆమెని వదిలివెళ్తూ, వృధాప్య ఛాయలు పొడసూపుతుంటాయో, అప్పుడు నాయకుడు ఆమెని తన దగ్గరకు రమ్మంటున్నాడు. ఆమె కోసం అతని శిరస్సు వంగి ఉంటుంది. వంగే ఉంటుంది.

"ఆహా! ఎంత ప్రేమ!' అన్న భావన కలుగుతుంది. ఆమె చుట్టూ ఉన్నవారు అందరూ ఆమె అందానికి దాసోహం అన్నవారే. అలాంటి వారింకా ఎంతోమంది లభిస్తారు. కానీ వారంతా తేనె త్రాగి, తేనె అయిపోగానే పువ్వును వదిలి వెళ్లే భ్రమరాల్లాంటివారు. ఆమె రూపలావణ్యాలు ఉడిగిపోగానే వడివడిగా వదిలి పారిపోయేవారు.

ఆమెని స్వచ్ఛంగా, సంపూర్ణంగా ప్రేమించి సంపూర్ణంగా సమర్పించుకున్నవాడు తానొక్కడే. అందుకని ఎంతకాలమైనా, ఆమె రూపలావణ్యాలు ఉడిగిపోయినా ఆమె కోసం తలవంచుకుని నిలబడి ఎదురుచూసే వాడు అతనొక్కడే. తనదొక్కటే స్వచ్ఛమైన ప్రేమ గమనించమంటున్నాడు. నాయకుడు ఆమెకు విన్నవిస్తున్నాడా? బెదిరిస్తున్నాడా? అయితే, పల్లవి వినగానే కలిగిన అనుమానం చరణం వినటంతోటే బలపడుతుంది. డబ్ల్యు. బి. యాట్స్ అన్న ఆంగ్ల కవి ఉన్నాడు. ఆయన ప్రేమ కవితలు కొన్ని రాశాడు. దాన్లో ' When you Are old' అన్న కవిత ఒకటి.

When you are old and grey and full of sleep,

And nodding by the fire, take down this book,

And slowly read, and dream of the soft look

your eyes had once, old of their shedown deep

How many loved your moments of glad grace

And loved your beauty with love false or true,

But one man loved the pilgrim soul in you,

And i loved the sorrows of your changing face

'sorrows of changing face ' – దర్పణ్ తుమ్హే జబ్ డరానే లగే.... How many loved your moments of glad grace \ And loved your beauty with love false or true –

అభీ రూప్ కా ఏక్ సాగర్ హో తుమ్ / కవల్ జితనె చాహోగి ఖిల్ జాయేంగే..

ఒకవేళ ఇంకా ఇందీవర్ పై యీట్స్ ప్రభావం గురించి ఎలాంటి సందేహాలున్నా 'యీట్స్' మరో కవిత 'The lover pleads with his friend for old friends ' ఆ అనుమానాన్ని పటాపంచలు చేస్తుంది.

Though you are in your shining days

Voices among the crowd

And new friends busy with your praise,

Be not unkind or proud, But think about old friends the most

Time' s bitter flood wil rise,

your beauty perish or be lost

For all eyes but these eyes.

నీ అందం తగ్గి, నిన్ను పొగుడుతూ నీ చుట్టూ తిరిగేవారు తగ్గిపోయినా ఒకరి దృష్టిలో మాత్రం నీ అందం తరగదు అంటున్నాడు యీట్స్. తన దృష్టిలో ఆమె అందం తరగకపోవటమే కాదు నీ కోసం ఎదురు చూస్తూంటాను అంటున్నాడు ఇందీవర్.

ఇలా ప్రేయసి కోసం జీవితాంతం ఎదురు చూడటం, ఆమె అన్ని తప్పులనూ క్షమించి స్వీకరించటం భారతీయ సాంప్రదాయ కవిత్వానికి కొత్త. భారతీయ సాహిత్యంలో విషాదాంతాలు లేవు. నాయకుడు, నాయికలు ఎడబాటును సహిస్తారు. కానీ చివరలో కలసిపోతారు. ఇలా వదలిపోవటాలు, నువ్వెప్పుడు వచ్చినా తలుపులు తెరచి ఉంటాయి, తలలు వంచి ఉంటాయి వంటి భావనలు పాశ్చాత్య భావాలు, సూఫీ భావాల కలయిక వల్ల వ్యక్తమయిన భావనలు. సూఫీ తత్వంలో భక్తుడు ప్రేమికుడు/ప్రేయసి, భగవంతుడు ప్రేయసి/ప్రియుడు. భగవంతుడి కరుణాకటాక్ష వీక్షణాలు తనపై ప్రసరించే వరకూ భక్తుడు ఎదురు చూస్తాడు, తపిస్తాడు, ప్రార్ధిస్తాడు. రబీంద్రనాథ్ ఠాగోర్ 'గీతాంజలి ' లోనూ ఇదే ప్రభావం కనిపిస్తుంది. దారి పక్కన పడుంటాడు. తన ప్రియుడు (భగవంతుడు) ఎప్పుడు ఆ దారిలో వస్తాడోనని ఎదురు చూస్తూ. ఈ భావనలన్నిటినీ కలగలిపి ఒక అద్భుతమైన సంపూర్ణ సర్వసమర్పణ ప్రేమగీతాన్ని సృజించాడు ఇందీవర్.

కొయీ షర్త్ హోతీ నహీ ప్యార్‌మ్

మగర్ ప్యార్ షర్త్‌ోంక తుం నే కియా

నజర్ మే సితారే జో చంకే జరా

భుజానే లగీ ఆరతీ కా దియా

జబ్ అప్నీ నజర్ మే హి గిర్నే లగో

అంధేరోమె అప్నే హి ఘిర్నే లగో

తబ్ తుమ్ మెరే పాస్ ఆనా ప్రియే

యె దీపక్ జలా హై, జలాహీ రహేగా

తుమ్హారే లియే...

పాశ్చాత్య ప్రేమ భావనకు సూఫీ ప్రేమ తత్వాన్ని జోడించి ఈ భావాల్ని సినిమా కథకు అన్వయించి కవితాత్మకంగా చెప్పాడీ చరణంలో. ప్రేమలో షరతులుండవు. అన్ కండిషనల్ లవ్ అన్నమాట. కానీ నాయిక షరతులు పెట్టింది. అయినా సరే ఆమె కోసం ఎదురు చూస్తూంటాను, అంటున్నాడు హీరో. అసలైన ప్రేమను తిరస్కరించినందుకు, ఆమె అవకాశవాదులు, అందంపై మోజుతో తన పంచన చేరిన వారిని నమ్మినందుకూ ఆమె బాధపడుతూ, వేదనాంధకారంలో మ్రగ్గుతున్నప్పుడు, అతని హృదయ జ్యోతి ఆమె కోసం వెలుగుతూనే ఉంటుంది. ఇదీ 1970 దశకంలో, ప్రేమ శారీరక సౌందర్యంపై మోజులా రూపాంతరం చెందుతున్న సమయంలో ఇందీవర్ సృజించిన అత్యంత సున్నితమైన, తిరస్కృత హృదయాలకు లేపనంలాంటి భగ్నప్రేమికులకు అమర ప్రేమ గీతం.

ఇందీవర్ గీత రచనలో బహు సుందరమైన సరళమైన శుద్ధ హిందీ పదాలు ధారాళంగా వాడేడు. హృదయ్, ప్రియే, రూప్ కా సాగర్, కవల్, దర్పణ్, గిర్‌నే, ఘిర్‌నే, దీపక్ లాంటి పదాల వాడకంతో పాటలోని వాక్యాలకు సారళ్యం, భావానికి గాంభీర్యంతో కూడిన పవిత్రతను ఆపాదించాడు. ఈ పాటలో 'ఇందీవర్ ' గిర్నా, ఘిర్నా అన్న రెండు ఒకే రకంగా ధ్వనించే పదాలను అందంగా వాడేడు. 'గిర్‌నా' అంటే క్రిందపడటం. 'ఘిర్నా ' అంటే 'చుట్టుముట్టటం'. ఆమె

దృష్టిలో ఆమె పడిపోవటం, చీకటి ఆమెను చుట్టుముట్టటం, తన మనస్సు సృష్టించిన చీకటి భావనలు చుట్టుముట్టగా ఆమె ఆ చీకటిలోనే ఉండిపోవటం అన్న భావనలను ఈ రెండు పదాల వాడకంతో సుందరంగా ప్రదర్శించాడు ఇందీవర్.

పాటకు బాణీ కుదిర్చిన కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ చారుకేశి రాగంలో బాణీని కుదిర్చారు. చారుకేశి రాగాన్ని సాధారణంగా భక్తిగీతాలకు వాడతారు. ఈ రాగం హృదయవేదనను ప్రతిబింబిస్తుంది. ఎదను కరిగింపచేస్తుంది. ఇది ప్రధానంగా కర్ణాటక సంగీతానికి చెందిన రాగమయినా, హిందీ సినీ సంగీత దర్శకులు అత్యంత సుందరంగా ఈ రాగాన్ని వాడుకున్నారు. ముఖ్యంగా, కళ్యాణ్‌జీ ఆనంద్‌జీ ఈ రాగాన్ని అధికంగా వాడేరు. 'కొయీ జబ్ తుమ్హారా' పాట అంత పవిత్ర ప్రేమ పాటగా భావించేందుకు ఈ రాగం ఎంతగానో తోడ్పడింది.

అయితే, పాట శ్రోతల మనస్సులలో స్థిర నివాసం ఏర్పరచుకోవటంలో ముకేష్ స్వరం అన్నిటికన్నా అధికమైన పాత్ర పోషిస్తుంది. ముకేష్‌కు శాస్త్రీయ సంగీతం తెలియదు. కానీ భగవంతుడు ఆయన స్వరానికి హృదయలోతుల్లోని విషాద భావాల్ని తట్టిలేపగల పరమాద్భుతమైన శక్తిని ఇచ్చాడు. అందుకే, హిందీ సినీ గీతాల ప్రపంచంలో ఎందరు గాయనీగాయకులు ఎన్ని అద్భుతమైన విషాద గీతాలు పాడినా, అవన్నీ ఒక ఎత్తు, ముకేష్ పాడిన విషాద గీతాలు ఒక ఎత్తు. ఆ స్వరమే ఓ విషాద సాగరం. ముకేష్ పాటల్లోని ప్రతి పదం ఆ విషాద సాగరంలో ఎగసిపడే అల. అతని స్వర తరంగాలు  సాగర హృదయ ఘోష భ్రాంతిని కలిగిస్తాయి. అందుకే 'కొయీ జబ్ ' పాటకు ముకేష్ స్వరం ప్రాణం. పదాలలో లేని విషాదం, గాంభీర్యం, హృదయవేదన ముకేష్ స్వరం పాటకు అద్దింది.

పాట చిత్రీకరణ అంత గొప్పగా ఉండదు. కానీ పాట నేపథ్యంలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ దృశ్యాలు, మేగ్డలీన్ కాలేజీ దృశ్యాలు అందంగా, గంభీరంగా సందర్భోచితంగా ఉంటాయి.

'కొయీ జబ్ తుమ్హారా' పాట ఒక వాంఛనీయమైన పవిత్ర అమర ప్రేమకు నిదర్శనంగా నిలుస్తుంది. ప్రేమలో ప్రతీకార భావనలకు తావు లేదని, ప్రేమ అంటే జీవితాంతం వరకూ ఉండే అనురాగం, త్యాగం అని ప్రేమలోని సంపూర్ణ సమర్పణ భావన ప్రేయసిని భగవంతుడిని, ప్రేమికుడిని భక్తుడిని చేసి, ముక్తి మార్గం చూపిస్తుందనీ ఈ పాట వింటూంటే అనిపిస్తుంది. అందుకే ఎన్నిమార్లు విన్నా పాట మాధుర్యం పెరుగుతుంది కానీ తరగదు.  ఆ తీయదనం ఎన్నటికీ వెగటు రాని తీయదనం. అనుభవించినకొద్దీ మరింత మాధుర్యం పెరిగి, ఆస్వాదించినకొద్దీ  పెరిగే తీయదనం ఇది.

(వచ్చే నెల మరిన్ని పాటలతో)

COMMENTS